సత్యనారాయణరాజు కుటుంబానికి ఎంఎల్ఎల పరామర్శ

ప్రజాశక్తి-ఐ.పోలవరం

కేశనకుర్రుపాలెం సీనియర్ నాయకులు గాదిరాజు సత్యనారాయణరాజు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను ముమ్మిడివరం, కాకినాడ సిటీ ఎంఎల్ఎలు పొన్నాడ వెంకట సతీష్ కుమార్. ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. తొలుత ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు ముదునూరు సతీష్‌రాజు, మండల కన్వీనర్ పిన్నమరాజు వెంకటపతి రాజు, వైస్ ఎంపిపి బాబ్జిరాజు, చిట్టిరాజు, సూరిబాబురాజు, వాసు రాజు, కాలే రాజబాబు, ఇందుకూరి రంగరాజు, పిన్నమరాజు పెదబాబు, మోకా రవి, పరివాజ్ కుమార్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రవాణాపై నిఘా

కలెక్టర్ హిమాన్షు శుక్లా

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, చిత్రంలో ఎస్‌పి శ్రీధర్, అడిషనల్ ఎస్‌పి బాషా

ప్రజాశక్తి - అమలాపురం

మాదక ద్రవ్యాల అక్రమ రవాణ, వినియోగంపై గట్టి నిఘా పెట్టాలని, మాదక ద్రవ్యాల వినయోగం వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ హిమాన్షుశుక్లా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నార్కో కో-ఆర్డినేషన్ సెంటర్ జిల్లా స్థాయి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్‌పి ఎస్.శ్రీధర్, అడిషనల్ ఎస్‌పి ఖాదర్ బాషా, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ శివశంకర్‌ప్రసాద్, జిల్లా డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేటర్ కెవి.భూపేష్, ఐబిడిఎస్‌పి ఎన్.కనకరాజు, ఐసిడిఎస్ పీడీ జివి.సత్యవాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. తొలుత ఎస్‌పి శ్రీధర్ మాట్లాడారు. గత సమావేశం నుంచి ఇప్పటివరకు 10 గంజాయి రవాణా కేసులు నమోదయ్యాయన్నారు. రూ.11.36 లక్షల విలువైన 376 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మాదక ద్రవ్యాలను వినియోగించడం వల్ల కలిగే నష్టాలను తెలుపుతూ యాంటీ డ్రగ్ క్యాంపెయిన్లను జులై నెలలో నిర్వహించామన్నారు. పోలీస్ అధికారులు గంజా రవాణా, పెడలింగ్, వినియోగించే వారిపై నిఘా పెంచారన్నారు. దీని వల్ల జిల్లాలో గంజాయి వినియోగం తగ్గిందన్నారు. గంజాయికి బానిసైనవారు సింథటిక్ డ్రగ్స్ ఉపయోగించే అవకాశం ఉందని, సంబంధిత డ్రగ్ కంట్రోల్ అధికారులు జిల్లాలోని మెడికల్ షాపులపై నిఘా ఉంచాలన్నారు. కచ్చితమైన ప్రిస్క్రిప్షన్ లేకుండా ఫార్మసీలు మందులు అమ్మకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉత్తర భారతదేశం నుంచి వచ్చే వాహనాల ద్వారా గంజాయి రవాణా అవుతున్నట్లు పోలీసుల తనిఖీల్లో తేలిందన్నారు. ఉత్తర భారతదేశం నుంచి వచ్చే వాహనాలను విస్తృతంగా తనిఖీ చేయాలన్నారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నియంత్రించడం తో పాటు మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇతర మత్తు పదార్థాల వినియోగాన్ని నియంత్రించాలన్నారు. బానిసలను గుర్తించడం, చికిత్స అందించడం, పునరావాసం కల్పించడం ద్వారా మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టవచ్చన్నారు. జిల్లాలో గంజాయి వినియోగాన్ని అరికట్టడంలో పోలీస్ శాఖ పని తీరు ప్రశంసనీయమన్నారు. జొన్నాడ, యానాం ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చే వాహనాలపై ఎక్కువగా నిఘా ఉంచాలన్నారు. జిల్లాలోని రెసిడెన్షియల్ వెల్ఫేర్ హాస్టల్లో రాత్రి సమయంలో వార్డెన్లు హాస్టల్స్‌లో ఉండటం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. తల్లిదండ్రులకు దూరంగా ఉండే విద్యార్థులు డ్రగ్స్ అలవాటు చేసుకునే అవకాశం ఉందని, వెల్ఫేర్ అధికారులు జిల్లాలోని హాస్టల్స్‌ని రాత్రిపూట సందర్శించాలన్నారు. డ్వాక్రా సంఘ మహిళలకు మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కల్పించాలని డిఆర్‌డిఎ అధికారులకు సూచించారు. జిల్లాలోని అన్ని కాలేజీలలో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేశారని స్కూళ్లలో కూడా 8 నుంచి 10వ తరగతి విద్యార్థులను చేర్చుతూ యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటయ్యేలా చూడాలని జిల్లా విద్యాధికారికి సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలను వివరిస్తూ షార్ట్ ఫిల్ములు తయారు చేసి సినిమా హాళ్లు, సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యాసంస్థలు ఉండే ప్రాంతాల్లో డ్రగ్స్ వినియోగం వలన కలిగే ఫలితాలను వివరిస్తూ హోర్డింగులు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో డ్రగ్స్ డి అడిక్షన్ సెంటర్‌కు ఆమోదం లభించిందని వారం రోజుల్లో ప్రారంభిస్తామని తెలిపారు.

దళిత కాలనీలో వెలసిన ఫ్లెక్సీ

రాజకీయ నాయకులకు ప్రవేశం లేదు

అర్తమూరులో వెలసిన ఫ్లెక్సీపై సర్వత్ర చర్చ

ప్రజాశక్తి - మండపేట

మండలంలోని అర్తమూరు గ్రామ దళితకాలనీ ముఖద్వారం వద్ద దళితులకు శ్మశాన వాటిక, జల్లు స్నాన ఘట్టం ఇచ్చేవరకు రాజకీయ నాయకులకు దళిత కాలనీలోకి ప్రవేశం లేదని ఓట్లు అడిగే హక్కు లేదని దళిత నాయకులు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం రెండవ రోజు జరగనున్న నేపథ్యంలో రాత్రికి రాత్రే వెలిసిన ఫ్లెక్సీతో సర్వత్రా చర్చ జరుగుతుంది. కొన్ని సంవత్సరాలుగా గ్రామంలోని దళితులు శ్మశాన వాటిక, జల్లు స్నానం ఘట్టం కోసం పోరాటం చేస్తున్నారు. గ్రామంలో 375 కుటుంబాలు, 1,500 మంది దళితులు ఉన్నారు. వీరు రామవరం రోడ్డులో చనిపోయిన వారి మతదేహాలకు అంత్యక్రియలు చేసుకుంటున్నారు. అక్కడ జల్లు స్నాన ఘట్టం ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులను కోరారు. దీంతో పంచాయతీ పాలకవర్గం వ్యతిరేకించడంతో ఉన్నతాధికారులను ఆశ్రయించారు. అయితే చెరువుగట్టు సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని సేకరించారు. ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు దాన్ని ప్రారంభించి దళితులకు అప్పగించారు. అదే రోజు దళితుడు చనిపోవడంతో స్థలంలోనే పూడ్చి పెట్టారు. అయితే స్థానిక రైతులు ఆ స్థలాన్ని వ్యవసాయ ఉత్పత్తులకు వినియోగించుకుంటున్నామని కోర్టుకు వెళ్లారు. ఇదిలా ఉండగా పాత స్థలంలో అనపర్తి మండలం పెడపర్తి గ్రామానికి చెందిన అధికారులు ఇది రోడ్డు భవనాల శాఖకు సంబంధించిన స్థలమని అక్కడ ఎటువంటి దహన కార్యక్రమాలు చేపట్టవద్దని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దీంతో దళితుల శ్మశాన సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. దిక్కుతోచని దళితులు ప్రభుత్వ కార్యాలయాలు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. నాటి నుంచి నేటి వరకు శ్మశానం, జల్లు స్నాన ఘట్టం ఏర్పాటు విషయంలో దళిత నాయకులు పెత్తందారుల మధ్య పోరాటం కొనసాగుతూనే ఉంది. ఈ సమయంలోఎంఎల్‌సి తోట త్రిమూర్తులు గ్రామంలో పర్యటించనున్న నేపథ్యంలో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు దళిత నాయకులు వినూత్నంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

ఆసియా క్రీడల్లో సాత్విక్ విజయం పట్ల హర్షం

ప్రజాశక్తి - అమలాపురం

ఆసియా క్రీడల్లో భారత్ పురుషుల బ్యాడ్మింటన్ డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగెశెట్టి జోడీకి స్వర్ణం లభించడం పట్ల కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. కోనసీమ పేరు దేశ, విదేశాల్లో చాటుతున్న సాత్విక్ స్థానికుడు కావడం గర్వ కారణం అని కోనసీమ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, కార్యదర్శి అల్లాడ శరత్‌బాబు అన్నారు. ఈ సందర్భంగా సాత్విక్‌ను కార్యదర్శి నాగేంద్ర, జాయింట్ సెక్రటరీ తిక్కిరెడ్డి సీనాబాబు, కెవి.రమణ అభినందించారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - ఆలమూరు

రాష్ట్రం ప్రభుత్వం పేదలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకు ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ఎంతో దోహదపడుతుందని కొత్తపేట నియోజకవర్గ అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.సుమలత అన్నారు. మండలంలోని చొప్పెల్ల గ్రామ సచివాయం-2 పరిధిలోని నవాబుపేటలో సర్పంచ్ సూరంపూడి ముత్యాలమ్మ, తహశీల్దార్ ఐపి.శెట్టి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె పరిశీలించారు. అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి చెందిన ప్రత్యేక వైద్య నిపుణులు, స్థానిక వైద్యులు అరుణ, షమీ ఉన్నీసా, ఆర్.మల్లికార్జునరావు, పి.భవానీ శంకర్, డి.సువర్చలాదేవి వైద్య సేవలు అందించారు. 342 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు పి.శ్రీలక్ష్మి సుమారు 120 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. ఈ సందర్భంగా రోగులకు 105 రకాల మందులను ఉచితంగా అందజేశారు. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న ఎనిమిది మందిని గుర్తించి వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రాజమహేంద్రవరంలో ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శి అయ్యన్న, హెల్త్ ఎడ్యుకేటర్స్ కె.జ్యోతికుమార్, ఎంపిహెచ్ఇఒ బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్ పి.శివప్రసాద్, ఆర్.బాలామణి 104 సిబ్బంది రోజా, రమణ తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమనానరు. సర్పంచ్ ఆచంట సత్యనారాయణ ఆధ్వర్యంలో 40 మందికి సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి, జడ్‌పిటిసి సభ్యులు పి.అబ్బు, ఎంపిటిసి సభ్యులు సుంకర వెంకటేశ్వరరావు, పిఎసిఎస్ చైర్మన్ ఆచంట వీరవెంకటస్వామి, డిసిసిబి మాజీ డైరెక్టర్ సలాది అప్పారావు, ఎంపిడిఒ ఎం.రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ కె.సూర్యారావు, సిడిపిఒ గజలక్ష్మి, కార్యదర్శి కామేశ్వరరావు, వైద్యాధికారులు, సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారిని సుమలత

సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

రైతులందరూ ఇ-క్రాప్ చేయించు కోవాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

రైతులందరూ తప్పని సరిగా ఇ-క్రాప్, ఇకెవైసి చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.రవి తెలిపారు. గ్రామ స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం దంగేరు రైతుభారోసా కేంద్రంలో శనివారం జరిగింది. ఈ సమావేశంలో రవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన విధివిధానాలు వివరించారు. ఇ-క్రాప్, ఇకెవైసి చేసిన వారి పొలాల వివరాలు మాత్రమే పిపిసి పోర్టర్‌లోకి వస్తాయన్నారు. ఈ సంవత్సరం ధాన్యం కోగొలుకు ముందు ఇకెవైసి చేయాలని, అలాగే ధాన్యం రవాణా చేసే వాహనాలన్నీ జిపిఎస్‌ను సొంతంగా సమకూర్చుకోవాలని తెలియజేశారు. రాబోయే సీజన్‌లో వరి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2183గా నిర్ణయించారని తెలిపారు. దీనికి హమాలీ, రవాణా చార్జీలు అదనంగా వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీరామచంద్రమూర్తి, ఇకెవైసి చేసుకోవాల్సిన రైతుల వివరాలు చదివి వినిపించారు. ఈ నెల 8లోపు వీటిని పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మంత్రి కొట్టు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని పలు గ్రామాల్లో దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, స్థానిక ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డితో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో రూ.3.75 కోట్లతో నిర్మించిన ప్రాకార మండపాన్ని ప్రారంభించారు. రూ.1.35 కోట్లతో నిర్మించనున్న ఎస్ఎస్ క్యూ లైన్ల పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధికి రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను ఆలయ సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. తిరుమల తరహాలో ఆలయం ముందు రూ.2.80 కోట్లతో పుష్కరిణి అభివృద్ధి పనులను, ఆలయం పార్కింగ్ స్థలం వద్ద నూతన నిర్మిస్తున్న అన్నదాన భవన పనులను ఆయన పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆలయానికి వచ్చే యాత్రికుల సౌకర్యాలపై ఆలయ చైర్మన్ ధర్మకర్త మండలితో సమీక్షించారు. అనంతరం లొల్ల గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని, వాడపల్లిలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. తొలుత వెంకటేశ్వర స్వామిని ఆయన దర్శించుకున్నారు ఆయనకు ఆలయ మర్యాదలతో సిబ్బంది స్వాగతం పలికి, తీర్థ ప్రసాదంతో పాటు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు, ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి

బాలుని వైద్యానికి గుడ్ సీడ్ సాయం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

సాయం అందిస్తున్న రమణారావు

గొల్లవిల్లికి చెందిన సలాది చిన్ని కుమారుడు మణి కంఠ(8) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స అనంతరం ఇంటికి వచ్చాడు. చిన్నారి వైద్యానికి వైసిపి అమలాపురం నియోజకవర్గం సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. మణికంఠ ఫిజియోథెరపీకి ఏర్పాటు చేస్తానని ఈ సందర్భంగా రమణారావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, ఉప సర్పంచ్ దొంగ దుర్గ, వైసిపి నాయకుడు జొన్నాడ చిన్ని, గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు గంటా లక్ష్మీప్రసాద్, పరమట రాజేష్, కుంచే అర్జున్, పోలినాటి భీమేష్ నాగాబత్తుల రాజ్‌కుమార్, దోనిపాటి రాంబాబు, బళ్ళ చిన్నరాజా, పరమట జాన్, పరమట మురళి పాల్గొన్నారు.

చర్మకారులను ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి - అమలాపురం

చర్మకారులను ఆదుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో చర్మకారుల సంఘాల ప్రతినిధులు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు తమ సమస్యలను కలెక్టర్‌కు ఏకరువుపెట్టారు. సమాజంలో అట్టడుగు వర్గంగా ఉండి ఉద్యోగాల్లో వ్యాపారాల్లో కనీస స్థాయిలో కూడా లేని మాదిగ సామాజిక వర్గం వారు పాదరక్షలు కుట్టకుంటూ బతుకుతున్నారనానరు. ప్రతి గ్రామంలో అర్హులైన చర్మకారులను గుర్తించుటకు ఒక ప్రత్యేక యాప్ ద్వారా సర్వే చేసి సర్టిఫికెట్‌తో సంబంధం లేకుండా పెన్షన్ ఇవ్వాలన్నారు. ఏడాదికి రూ.15వేలు ఆర్థిక సాయంగా అందిస్తే వారి జీవితాల్లో ఎంతో కొంత మార్పు తీసుకురావొచ్చన్నారు. వత్తిలో నైపుణ్యం పెంచుకునేలా స్టైఫండ్‌తో కూడిన శిక్షణ ఇవ్వాలన్నారు. శిక్షణ అనంతరం వడ్డీ లేని బ్యాంకు రుణాలు ప్రభుత్వం అందించాలన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించారు. బ్యాంకు అధికారులతో చర్చించి చర్మకారులకు షాపుల నిర్మాణం కోసం, పరికరాల కొనుగోలు కోసం సున్నా వడ్డీకి రుణాలు అందేలా చూస్తానన్నారు. అర్హులందరికీ పెన్షన్ సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.వీర్రాజు, వీధి శ్యామూల్, పిప్పర వెర్రియ్, నేదునూరు సత్యనారాయణ, ఎస్.సత్యనారాయణ, వై.సత్తిబాబు, ఎ.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎంఎల్‌సి ఇజ్రీయేల్, చర్మకార వృత్తిదారులు

కృపమ్మ విషయంలో దిగొచ్చిన ప్రభుత్వం

రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటన

ప్రజాశక్తి - రామచంద్రపురం

గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఆశ వర్కర్‌గా పనిచేస్తూ జగనన్న సురక్ష వైద్య శిబిరంలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన రేపూరి కృపమ్మకు ప్రభుత్వం రూ.10 లక్షలు ప్రకటించిందని సిఐటియు జిల్లా కార్యదర్శి తెలిపారు. సిఐటియు, ఆశాలు చేసిన ఆందోళనలతో ప్రభుత్వం దిగొచ్చిందన్నారు. ఆమె కుమార్తెకు ఉద్యోగం, ఇల్లు, దహన సంస్కారాలకు రూ.25 వేలు ఆర్థిక సాయం, భర్తకు పింఛను ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని బలరాం వివరించారు.

అంబాజీపేటలో అశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కృపమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని పిహెచ్‌సిలో వినతిపత్రం అందించారు. బి.ఎస్తేరురాణి, కె.లక్ష్మి, ఎన్.సత్యవతి, సిహెచ్.బేబి, ఎస్.సరోజిని తదితరులు పాల్గొన్నారు.

రాంబాబుకు సేవా పురస్కారం

ప్రజాశక్తి- కొత్తపేట



రాంబాబు కు పురస్కారం అందిస్తున్న వర్మ

పాత్రికేయ రంగంలో 36 ఏళ్లుగా సేవలందించిన కొత్తపేటకు చెందిన సీనియర్ పాత్రికేయుడు జగతా శ్రీరామచంద్రమూర్తి(రాంబాబు)కు చల్లగాలి సేవా పురస్కారం లభించింది. రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ మెజీషియన్ శ్రీనివాస్ వర్మ శనివారం మండల పరిధిలోని వాడపాలెంలోని డాక్టర్ పెద్దింటి రామం స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాంబాబుకు ఈ పురస్కారాన్ని అందజేశారు. కొత్తపేటకు చెందిన రాంబాబు పాత్రికేయ రంగంలోనే కాక ఇతర రంగాల్లోనూ పలు సేవలు అందించారు. పేద కళాకారులకు చేయూతనందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

విద్యా జ్యోతి స్కాలర్‌షిప్ అందజేత

ప్రజాశక్తి- కొత్తపేట

కొత్తపేట మండలం పలివెల జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని ఆరుగురు విద్యార్థులకు కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో విద్యా జ్యోతి స్కాలర్‌షిప్‌లను శనివారం అందించారు. హైస్కూల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థినిలకు రూ.22,500 కెనరా బ్యాంకు సిబ్బంది అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మార్గాన గంగాధర్‌రావు, టిడిపి నాయకులు సాదే శ్రీనివాసరావు, దేవస్థాన మాజీ చైర్మన్ తులా సూర్యనారాయణమూర్తి, కెనరా బ్యాంకు మేనేజర్ పి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



కొనసాగుతున్న టిడిపి నిరసన దీక్షలు

ప్రజాశక్తి యంత్రాంగం

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి.

రామచంద్రపురం టిడిపి కార్యాలయం వద్ద ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షలు శనివారం నాటికి 25వ రోజుకు చేరుకున్నాయి. టిడిపి కె.గంగవరం మండల నాయకులు, రామచంద్రపురం పట్టణ, మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జ్, బూత్ ఇన్‌ఛార్జ్లు ఇతర నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. గ్రామ స్థాయి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మండపేట మున్సిపల్ కార్యాలయం వద్ద ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిలే నిరహారదీక్షలు శనివారం కొనసాగాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు, ఎంఎల్ఎ వేగుళ్ల మాట్లాడారు. వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడాలన్నారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ దీక్షకు పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి సల్మాన్ హుస్సేన్, టిడిపి నాయకులు గుండు వీర తాతరాజు తదితరులు సంఘీభావం తెలిపారు.

ఉప్పలగుప్తం మండలం గొల్లవిలి పంచాయతీ పరిధిలోని వాడపర్రులో చంద్రబాబుకు మద్దతుగా టిడిపి శ్రేణులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాయి. .కాంతిలో క్రాంతి కార్యక్రమంలో భాగంగా టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. టిడిపి నాయకులు గొలకోటి సత్తిరాజు, చీకట్ల ఏసు, మద్దింశెట్టి సురేష్, పిల్లా బుజ్జి, అడబాల సత్యనారాయణ, నాగారపు అర్జునరావు, కాగిత సత్యనారాయణ, చప్పిడి వెంకటేశ్వరరావు, పేరాబత్తుల చిన్న, జనసేన నాయకులు మంచెం బాలకృష్ణ, జన సైనికులు పాల్గొన్నారు.

ఆలమూరు చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా కాంతితో క్రాంతి పోరాటంలో భాగంగా శనివారం సాయంత్రం ఏడు గంటలకు ఆలమూరులో టిడిపి నాయకులు, కార్యకర్తలు బైకు ర్యాలీ నిర్వహించారు. తొలుత బస్టాండ్ సెంటర్ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. బైకు లైట్లు, సెల్‌ఫోన్ లైట్లు ఆన్‌చేసి చంద్రబాబుకు మద్దతు తెలిపారు.

ఆలమూరులో నిరసన తెలుపుతున్న టిడిపి శ్రేణులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండల పరిధిలోని పైడిమెట్ట జంక్షన్ వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తి గాయాలపాలయ్యాడు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలు.. కొవ్వూరుకు చెందిన రాచర్ల నవీన్ కుమార్, జువ్వల కిషోర్‌లు ఆంధ్ర షుగర్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. విధులను ముగించుకుని ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తూ వేగంగా వెళ్లి స్తంభాన్ని ఢీకొట్టాడు. వాహనాన్ని నడుపుతున్న కిషోర్ వాహనంతోపాటు పంట పొలంలో పడిపోగా, నవీన్ రోడ్డుపై పడిపోయాడని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. స్థానికులు వారిద్దరినీ సమీపంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అయితే వాహనాన్ని నడుపుతున్న కిషోర్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. క్షతగాత్రుడు నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కెవి.రమణ తెలిపారు.

ఉరేసుకుని యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి పెద్దాపురం

ఉరివేసుకుని ఒక యువకుడు శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇవి.. సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామానికి చెందిన టి.ప్రసాద్(25) పెద్దాపురం మండలం ఆర్బి కొత్తూరు గ్రామానికి మోటార్ బైక్ పై వచ్చి శనివారం మద్యం తాగాడు. అక్కడ చెట్టుకు ఉరి వేసుకున్నాడు. ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఎస్ఐ వి.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి-గండేపల్లి

ఈనెల 3న గండేపల్లి మండలం పి.నాయకంపల్లి హత్యకు కారకులైన వ్యక్తులను అదుపులో తీసుకుని రిమాండ్ పంపించినట్టు జగ్గంపేట సిఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ వై.గణేష్ కుమార్ తెలిపారు. వివరాలు మేరకు గండేపల్లి మండలం పి నాయికుంపల్లి గ్రామంలోని గంధం అబ్బులు అనే వ్యక్తి హత్య కాబడినట్లుగా ఫిర్యాదు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు అధికారి అయిన సిఐ బి.సూర్య అప్పారావు ఈ కేసులో ఆరుగురిని నిందితులుగా గుర్తించారు. వారిలో నిందితులు అయిన గంధం శాంత కుమారి, ముప్పిడి వెంకటలక్ష్మి, కొమ్ముకూరి బేబి, వేమగిరి వరలక్ష్మిలను మధ్యవర్తుల సమక్షంలో అరెస్టు చేశారు. నిందితులను రిమాండ్ నిమిత్తం పెద్దాపురం కోర్టుకు పంపుతున్నటు ఎస్ఐ వై.గణేష్ కుమార్ తెలిపారు

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - కరప

గొర్రిపూడి గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేయగా ఇద్దరు వ్యక్తులు పట్టుబడినట్లు ఎస్ఐ యన్ రామకష్ణ తెలిపారు. శనివారం సాయంత్రం పోలీసులకు అందిన సమాచారం మేరకుగొర్రిపూడి గ్రామం కష్ణబాబు పుంత వద్ద పేకాట ఆడుతున్న వారి పై కరప ఎస్ఐ, సిబ్బంది చేసిన దాడిలో ఇద్దరు పట్టుబడ్డారు. సంఘటన స్థలంలో వారి వద్ద నుంచి రూ.4570 నగదు, పరారైన వారితో కలిపి 5మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని కలవలపల్లి గ్రామంలో నాటు సారాను విక్రయిస్తున్న ఓ మహిళను సెబి సిఐ ఇటివివి సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది అదుపులోకి తీసుకున్నాడు. మట్టా సత్యవతి నాటు సారా విక్రయిస్తుండగా 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఆమెపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు సిఐ సత్యనారాయణ తెలిపారు.

పిడిఎస్ బియ్యం నిల్వలపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి - కడియం

మండలంలోని కడియపులంకలో పిడిఎస్ బియ్యం నిల్వ చేసినట్లు వచ్చిన సమాచారంతో విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులు సంబంధిత ఇంటిపై దాడి చేశారు. ఆ ఇంటి ఆవరణలో ఒక వాహనంలో 37 ప్లాస్టిక్ బస్తాలలో సుమారు 1806 కేజీల పిడిఎస్ బియ్యంను గుర్తించారు. ఈ చౌక బియ్యంను పెన్నాడ దొరబాబు కడియపులంక పరిసర ప్రాంతాల కార్డుదారుల నుంచి రూ.18 లకు కొనుగోలు చేసి తిరిగి అదే బియ్యాన్ని రూ.20లకు ఇటుక బట్టీల కార్మికులకు విక్రయిస్తున్నట్టు విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ బియ్యంకు సంబంధించి ఎటువంటి బిల్లులు లేనందున కడియం సివిల్ సప్లయ్స్ అధికారులు 1806 కేజీల చౌక బియ్యం, వాహనంను సీజ్ చేసి 6-ఎ కేసు నమోదు చేసి, పిడిఎస్ బియ్యాన్ని అక్రమ నిల్వ ఉంచిన పెన్నాడ దొరబాబుపై క్రిమినల్ కేసు నమోదు కొరకు పోలీసు స్టేషన్‌కు సిఫారసు చేసినట్లు విజిలెన్స్ అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా రీజనల్ విజిలెన్స్ ఇన్‌ఛార్జ్ ఎస్పి కె.కుమార్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో చౌక బియ్యం అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందన్నారు. ఎవ్వరైనా చౌక బియ్యం కొనడం, అమ్మడం చేస్తే సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో సిఐ శ్రీనివాసరెడ్డి, కానిస్టేబుల్స్ లోవరాజు, కిషోర్, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులు పాల్గొన్నారు.

పురుగు మందుల దూకాణాలపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి - సీతానగరం

రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ మరియు ఎన్ఫోర్స్మెంట్ అధికారి కె.కుమార్ ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులతో కలిసి శనివారం మండలంలోని రఘుదేవపురం వెంకట మోహన ట్రేడర్స్ ఎరువులు మరియు పురుగు మందుల దుకాణంలో ఆకస్మికమిక తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్ లేకపోవడం, రైతులకు బిల్లులు ఇవ్వకపోవడం, గ్రౌండ్ స్టాక్‌కు, బుక్ స్టాక్ మధ్య వ్యత్యాసాలను గుర్తించారు. అదేవిధంగా ప్రభుత్వ నిషేధిత పురుగు మందులు నిల్వలు ఉండటంతో షాపు యజమాన్యంపై క్రిమిసంహారక చట్టం 1968 ఉల్లంఘన క్రింద రాజమహేంద్రవరం 2వ తరగతి మేజిస్ట్రేట్ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ తనిఖీల్లో డిఎస్పి ముత్యాల నాయుడు, విజిలెన్స్ వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, సీతానగరం మండల వ్యవసాయ అధికారి కె. సూర్య రమేష్, కానిస్టేబుల్ లోవకుమార్ పాల్గొన్నారు.

యానాం వార్తలు

స్వచ్ఛ భారత్ చేస్తున్న బ్యాంకు సిబ్బంది

'సిటిజన్ బ్యాంకు' ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి-యానాం

యానాం ది.సిటిజన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ సిబ్బంది శనివారం ఆ బ్యాంకు పరిసరాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు పరిసరాలు, రోడ్డు, డ్రైన్లను శుభ్రం చేసి చెత్త తొలగించారు. బ్రాంచ్ మేనేజర్ కాశి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది గోపాలకష్ణ, సతీష్, వెంకటరమణ, శ్రీనివాస్, తులసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పరిసరాల పరిశుభ్రతపై అందరూ శ్రద్ధ తీసుకోవాలని బ్యాంకు మేనేజర్ అశోక్ కుమార్ అన్నారు. పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

మంటల్లో కాలిన పురాతన ఆళ్వార్ విగ్రహం

ప్రజాశక్తి - యానాం

యానాంలో భూ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని పున్న నిర్మించే ప్రక్రియలో భాగంగా మూలవిరాట్టులను ఆలయ ప్రాంగణంలో బాలాలయం నిర్మించి విగ్రహాలను ప్రతిష్టంపజేసి నిత్య పూజలు కొనసాగుతున్నాయి.విగ్రహాలను తీసే క్రమంలో వెంకటేశ్వర స్వామికి పూజలు నిర్వహించే ఆల్వార్ విగ్రహాన్ని మూలాన పెట్టారు. బాలాలయం శుభ్రం చేసే క్రమంలో చెత్తతో పాటు విగ్రహం కూడా మంటల్లో కాలింది. ఇది తెలుసుకున్న భక్తులు ఆలయానికి చేరుకుని విగ్రహాన్ని తగలబెట్టిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఆలయం వద్ద విధులు నిర్వహిస్తున్న వారిని వివరణ అడుగగా ఆలయం వద్ద సరైన భద్రత లేక ఇష్టారాజ్యంగా బయట వ్యక్తులు వచ్చి ఆలయంను అశుభ్రం చేస్తున్నారన్నారు.

పలుచోట్ల అన్నదానాలు

ప్రజాశక్తి-యానాం

గణపతి నవరాత్రులను పురస్కరించుకుని యానాం పరిధిలోని శనివారం పలుచోట్ల అన్నదానాలు నిర్వహించారు. మెట్టకూరు గణపతి నగర్ వద్ద,అ ంబేడ్కర్ నగర్ రామాలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో ప్రజలు ఈ అన్న సమారాధనలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల గ్రామ పెద్దలు, యువజన సంఘం సభ్యులు,కమిటీ ప్రతినిధులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

పలు ఆలయాల హుండీల ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-యానాం

పిల్లారాయ స్వామి ఆలయంలో హుండీ లెక్కింపు

యానాం నియోజకవర్గ పరిధిలో కొలువైన ప్రధాన ఆలయాల్లో హుండీల్లో ఆదాయాన్ని శనివారం లెక్కించారు. భూసమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం, పిల్లారాయ దేవాలయం, పోలేరమ్మ ఆలయం, శివాలయాల్లో భక్తులు సమర్పించిన కానులు మొత్తం రూ.10లక్షల49వేల995 గా లెక్కించినట్లు ఆలయ అధికారి కె.రామకృష్ణ తెలిపారు.

పారిశుధ్యకార్మికుల కోసం నిర్మిస్తున్న క్వార్టర్స్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

నిర్మాణ పనుల వేగవంతానికి ఆదేశం

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక జగన్నాధపురం 23వ డివిజన్ రెల్లిపేట లో రూ 5.30 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న పబ్లిక్ హెల్త్ వర్కర్స్ క్వార్టర్స్ నిర్మాణ పనులను నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు శనివారం పరిశీలించారు. పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శిథిలమైన పాత క్వార్టర్స్ స్థానంలో 42 మంది పారిశుధ్య కార్మికుల కోసం జి ప్లస్ వన్ విధానం లో నూతన గహాలు నిర్మిస్తున్నామన్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. సుమారు రెండు నెలల వ్యవధిలో నిర్మాణ పనులు పూర్తయ్యే అవకాశం ఉందని నగరపాలక సంస్థ ఎస్ఈ పి. సత్యకుమారి కమిషనర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఈ పి. వెంకట్రావు, ఇంజనీరింగ్ అధికారులు ఆయన వెంట ఉన్నారు.

స్మార్ట్ సిటీ పనుల పరిశీలన

స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన పలు అభివద్ధి పనులను స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ సిఇఒ, ఎండి సిహెచ్.నాగ నరసింహారావు పర్యవేక్షించారు. రాజా ట్యాంక్ పార్క్ సమీపంలోని రాగిరెడ్డి వెంకట జయరామ్ కుమార్ కళాక్షేత్రం, స్కేటింగ్ రింక్ పనుల ప్రగతిని పరిశీలించారు. ఆయన వెంట స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకట్రావు, అధికారులు ఉన్నారు.

జేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విజేతలకు ఉపాధ్యాయుల అభినందన

ప్రజాశక్తి - మండపేట

మండలంలోని వెలగతోడు జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్-14, 17 విభాగాల్లో టెన్నికాయిట్, కబడ్డీ, ఖోఖో, షాట్ ఫుట్, యోగాలో నియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ జిల్లా స్థాయిలోను ఉత్తమ ప్రతిభను కనుబర్చాలన్నారు. విజేతలు పి.పావని, డి.నాగమణి, పి.మనో హరిణి, టి.సత్య, బి.హైమిష, సాయిప్రసన్న, ఎ.భవాని, ఎన్.కీర్తి, ఆర్.సంతోష్ కుమార్, దుర్గారావు, ఎం.మణికంఠ, ఆర్.సంతోష్, రాంప్రసాద్, సంతోష్‌కుమార్, వినయ్ సాయిదుర్గ నియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచారు. పీడీ సహదేవుడు, ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాస్‌రావు, తల్లితండ్రులు అభినందించారు.

పెల్లుబికిన ప్రజాగ్రహం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనురసిస్తున్న అప్రజాస్వామిక విధానాలపై ప్రజాగ్రహం పెల్లుబికుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ఐఏ సోదాలు నిర్వహించి వివిధ ప్రజా సంఘాల నేతలకు సిఆర్‌పిసి 160 నోటీసులు ఇచ్చిన విషయం విధితమే. న్యాయవాదుల ఇళ్లపైనా సోదాలు నిర్వహించడం పలు విమర్శలకు దారి తీసింది. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న 'న్యూస్ క్లిక్' నిర్వాహకులపైనా ఉపా చట్టాలు నమోదు చేయటం సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన వారిపై కేంద్ర సంస్థలను వినియోగిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తాజా పరిణామాల నేపధ్యంలో జర్నలిస్టు సంఘాలు ఆందోళన బాటపట్టాయి. ఈ ఆందోళనలకు వివిధ పార్టీల నేతలు, ప్రజాస్వామ్య వాదులు మద్దతు తెలుపుతున్నారు. ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ప్రశ్నించకపోతే రాబోయే రోజుల్లో పత్రికా స్వేఛ్ఛను కూడా హరించే ప్రమాదం ఉందని స్పష్టమవుతోంది. బిజెపి అనుసరిస్తున్న విధానాలను అత్యంత వేగంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న వైసిపి ప్రభుత్వానికి సైతం రాబోయే రోజులలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. 2014 ఎన్నికల ముందు ఇచ్చిన అనేక హామీలను మోడీ ప్రభుత్వం బుట్టదాఖలు చేసిన విషయం విధితమే. 2019 అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఓ వైపు పన్ను భారాలు, మరో వైపు అధిక ధరలు సామాన్యులకు గోరుచుట్టుపై రోకలి పోటులా మారాయి. రాష్ట్ర ప్రయోజనాలను సైతం పక్కన పెట్టిన వైసిపి ప్రభుత్వం బిజెపి విధానాలను అనుసరించడం పట్ల ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రాబోయే రోజులలో గత తెలుగుదేశం ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి తప్పదనే హెచ్చరికలు విన్పిస్తున్నాయి

విమర్శలు ప్రతి విమర్శలు

స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో అక్రమాలు జరిగాయంటూ టిడిపి అధినేత చంద్రబాబపై కేసు నమోదు చేయటం, సెంట్రలు జైలుకి రిమాండ్‌కు తరలించిన విషయం విధితమే. తాజాగా మరో సారి రిమాండ్ పొడిగిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేసిన విషయం విధితమే. మూడు వారాల అనంతరం ఢిల్లీ నుంచి వచ్చిన లోకేష్ రెండ్రోజులకే మళ్లీ తిరుగు పయనమయ్యారు. చంద్రబాబు దిశానిర్దేశాలే కారణమని తెలుస్తోంది. తమ అదినేతను అక్రమ అరెస్టులు చేశారని టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. బాబుతో నేను అనే కార్యక్రమంలో ప్రజల్లో మద్దతు కూడగట్టే ప్రయత్నం జరుగుతోంది. మరోవైపు అధికార పార్టీ సైతం గడప..గడపకూ వైసిపి పేరుతో కార్యక్రమాలకు పిలుపు నిచ్చిన విషయం విధితమే. టిడిపి నిర్వహిస్తున్న ప్రాంతాల్లోనే అధికార పార్టీ కార్యక్రమాలు నిర్వహించడంతో పలు విమర్శలు విన్పిస్తున్నాయి. కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసులు ప్రత్యేక నిఘా పెంచారు. అయితే రాష్ట్రంలోని టిడిపి, వైసిపి పార్టీ శ్రేణులు పూర్తిగా ప్రజా సమస్యలను విస్మరించాయి. బిజెపి ప్రభుత్వాన్ని ఎక్కడా నిలదీసే పరిస్థితులు కన్పించడంలేదు. మరో వైపు రాబోయే ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా సమీకరణలు ప్రధాన పార్టీలు కసరత్తు ప్రారంభించాయి. వైసిపి ప్రజా ప్రతినిధులు తమ స్థానాలను నిలబెట్టుకోవటం కోసం పాట్లు పడుతున్నారు. రాష్ట్రానికి మొండి చేయి చూపించిన కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయలేని స్థితిలో ఈ రెండు పార్టీలు ఉన్నా యని తెలుస్తోంది.విధాన పరమైన అంశాలపై స్పష్టత ఇవ్వ కుంటే రాబోయే ఎన్నికల్లో మూల్యం చెల్లించుకో తప్పదని తెలుస్తోంది.

గోదారి గలగలలు

చుట్టుముడుతున్న సీజనల్ వ్యాధులు

జిల్లా ప్రజలను సీజనల్ వ్యాధులు చుట్టుముట్టడంతో అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. గత నెలలో కళ్ల కలకలతో అత్యధిక మంది అస్వస్థతకు గురైన విషయం విధితమే. తాజాగా జ్వర పీడితుల సంఖ్య క్రమ క్రమంగా పెరగటంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో ఓపీల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సౌకర్యాలు నేతి బీర చందంగా మారాయి. బ్లడ్ టెస్ట్‌లు మొదలుకొని వివిధ రకాల పరక్షలు, మందులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో లభించడంలేదు. అత్యధిక మందిని జిల్లాలో ప్రధాన ఆస్పత్రులైన రాజమహేంద్రవరం, కాకినాడకు రిఫర్ చేస్తున్నారు. దీంతో రోగులు వెనకడుగు వేస్తున్నారు. తప్పని సరి పరిస్థితులలో తమ గ్రామాల్లోనే ఆర్ఎంపిలు, ఇతర ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ వైద్యరంగాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు సంతృప్తికరమైన వైద్య సేవలు

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు సంతృప్తికరమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్ రెడ్డి వివిధ శాఖల రాష్ట్ర ఉన్నతా ధికారులతో కలిసి శుక్రవారం ఉదయం అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లు, జెసిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కాకినాడ జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లా ఆయా శాఖల జిల్లా అధికారులతో కలిసి హాజరయ్యారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్, వైద్య సిబ్బంది ఖాళీల భర్తీ, సీజనల్ వ్యాధుల నివారణ, ఫీవర్ సర్వే వివరాలు, మహిళా శిశు సంక్షేమానికి సంబంధించి అంగన్వాడీ, పాఠశాల విద్యా శాఖల కార్యకలాపాలు, స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్, హౌసింగ్ నిర్మాణ పనులు పురోగతి, గ్రామ వార్డు సచివాలయాల అర్జీల పరిష్కారం, గడప..గడపకూ మన ప్రభుత్వం, జగనన్నకు చెబుదాం, ఇతర ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై సీఎస్ జవహర్ రెడ్డి కలెక్టర్లతో సమీక్షించారు. అనంతరం సమావేశంలో జిల్లాలో జగనన్న సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న తీరును కలెక్టర్ వైద్య అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఆరోగ్య సేవలను మరింత చేరువ చేయాలని లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిదన్నారు. గ్రామీణం, పట్టణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలలో సక్రమంగా ప్రజలందరికీ వైద్య సేవలు అందే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకునేలా మరింత విస్తృత అవగాహన కల్పించా లన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు అధికారులు ప్రత్యేక కృషి చేయాల న్నారు. ప్రధానంగా చిన్నారులు, గర్భిణులకు రక్తహీనతను అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాల న్నారు. అలాగే జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పని చేయాలన్నారు. వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖల అధికారులు క్షేత్రసాయిలో ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ సిబ్బందిని సమన్వయం చేసుకుని పనిచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విద్యా శాఖకు సంబంధించి మనబడి నాడు-నేడు పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రధానంగా గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే నూరు శాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్‌పి సిఇఒ ఎ.రమణారెడ్డి, సిపిఒ పి.త్రినాథ్, డిఎంహెచ్ఒ డా. జె.నరసింహనాయక్, డీఐఒ డా.కె.రత్నకుమార్, ఐసిడిఎస్ పీడీ కె.ప్రవీణ, డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, డిఇఒ జి.నాగమణి, డిపిఒ ఆర్.విక్టర్, హౌసింగ్ పీడీ బి.సుధాకర్ పట్నాయక్, జిల్లా ఉపాధి శిక్షణ అధికారి శ్రీనివాసరావు, నైపుణ్య శిక్షణ అధికారి హరిశేషు, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్, ట్రాన్స్ కో ఇంజనీరింగ్ అధికారులు, కాకినాడ, పెద్దాపురం డిఎల్‌డిఒ తదితరులు హాజరయ్యారు.

సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ

సేంద్రియ ఎరువు తయారీని వివరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

రమణయ్యపేటలో సహజ సిద్ధంగా సేంద్రీయ ఎరువు తయారు చేసే విధానంపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సేంద్రీయ వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ మధ్య నాగేశ్వరావు మాట్లాడుతూ సేంద్రీయ పురుగు మందుల తయారీ, వాడకం వలన రైతులకు పెట్టుబడి గణనీయంగా తగ్గుతుందన్నారు. వరిని ఆశించే నల్లి తెల్లదోమ నివారణకు కిలోల ఉల్లిపాయలు, ఐదు కిలోల వేపాకు, ఐదు కిలోల కరివేపాకు, ఐదు కిలోల జిల్లేడు, ఐదు కిలోల నేరేడు, ఐదు కిలోలు ఉమ్మెత్త ఆకును ముద్దలుగా నూరి ఆరు లీటర్ల నీటిలో మరిగించి పావు కిలో పసుపు కలిపి చల్లార్చు కుని పిచికారీచేయాలన్నారు. కార్యక్రమంలో మండల కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ ముధర యేసుబాబు సిబ్బంది రైతులు ఉన్నారు.

నియామకపత్రాలు అందజేస్తున్న దృశ్యం

జాబ్‌మేళాలో 135 మంది ఎంపిక

ప్రజాశక్తి-ఏలేశ్వరం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం వికాస, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 135 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీత మాట్లాడుతూ 13 ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై 740 ఉద్యోగాలకు దరఖాస్తుల కోరగా 243 మంది నిరుద్యోగులు హాజరయ్యారన్నారు. వీరిలో అర్హత, ఇంటర్వ్యూ ఆధారంగా 135 మందిని ఎంపిక చేసినట్లు ఆమె తెలిపారు. ఎంపికైన నిరుద్యోగులకు ప్రిన్సిపల్ నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నేత అలమండ చలమయ్య, జెఎసి కో ఆర్డినేటర్ కె.వెంకటేశ్వరరావు, వివివిఎస్.ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

'శిరంగు'కు పలువురి పరామర్శ

ప్రజాశక్తి- ఉప్పలగుప్తం

వెంకటలక్ష్మికి నివాళులర్పిస్తున్న జడ్‌పిటిసి తదితరులు

సతీ వియోగంతో బాధపడుతున్న భీమనపల్లి పంచాయతీ సూదాపాలేనికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డిసిసిబి మాజీ చైర్మన్ శిరంగు కుక్కుటేశ్వరరావు కుటుంబాన్ని శనివారం పలువురు పరామర్శించారు. కుక్కుటేశ్వరరావు సతీమణి వెంకటలక్ష్మి ఇటీవల మృతి చెందారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుమారులు సొసైటీ అధ్యక్షులు శిరంగు సత్తిరాజు, నాగకుమార్, కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో జడ్‌పిటిసి సభ్యులు గెడ్డం సంపదరావు, మాజీ ఎంఎల్ఎ చిల్లా జగదీశ్వరి, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, జనసేన అమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి శెట్టిబత్తుల రాజబాబు, నాయకులు అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, చిల్లా పురుషోత్తం, ఊటాల రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

మధుమేహంపై అవగాహన

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జంపన సుమన్‌వర్మ అధ్యక్షతన శనివారం వన్నె చింతలపూడిలో వైస్ ప్రెసిడెంట్ యర్రంశెట్టి వెర్రబ్బాయి ఇంటి వద్ద మధుమేహంపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పిఎస్.శర్మ మాట్లాడారు. మధుమేహం వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలను వివరించారు. వ్యాధి బాధితులు ప్రతి రోజూ తప్పనిసరిగా నడవాలని తెలిపారు. ముఖ్య అతిథి క్లబ్ ప్రెసిడెంట్ జివిఎస్.మల్లిబాబు మాట్లాడుతూ మధుమేహం రావడానికి వయసుతో సంబంధం లేదన్నారు. డాక్టర్ చెప్పిన విషయాలను అందరూ గమనించి జాగ్రత్త పడాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి శెట్టిబత్తుల రాజబాబు, క్లబ్ సెక్రటరీ చిక్కాల సతీష్, లయన్స్ క్లబ్ సభ్యులు నడింపల్లి వెంకట రామరాజు, యర్రంశెట్టి చక్రధర్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ యానాం జుడిషియల్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో
M.C. No. 2/2023
Between :
సంగాని ధనకుమారి ...పిటీషనర్
మరియు
సంగాని సతీష్ ...రెస్పాండెంట్
To,
సంగాని సతీష్, S/o. వెంకట రావు
డో.నెం. 5-11-062, సావిత్రి నగర్,
యానాం. P.S.
ఈ నోటీసు ప్రకారం మీకు తెలియజేయునది ఏమనగా పై కేసులో పిటీషనర్ అయిన శ్రీమతి సంగాని ధనకుమారి మీపై MC 2 of 2023 నెంబరున యానాం జుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో మీపై మనోవర్తి నిమిత్తం 125 CRPC ప్రకారం వేసిన కేసు ది. 12-10-2023వ తేదీన మీ యొక్క రాకకు వాయిదా అయివున్నది. కాబట్టి మీరు కానీ, మీ ప్లీడరు గారి ద్వారా కానీ ది. 12-10-2023వ తేదీన ఉదయం 10 గంటలకు గౌరవనీయులైన జుడిషియల్ మేజిస్ట్రేట్ యానాం వారి కోర్టు నందు హాజరు కావలెను. అట్లు కాని యెడల మీ పరోక్షమున కేసు తీర్మానించబడును.
(కోర్టువారి అనుమతితో)
N. సత్యనారాయణ రాజు
I. రామకృష్ణ, అడ్వకేట్స్
యానాం.
యానాం
ది.7-10-2023
సెల్: 94401 12512

మహారాజశ్రీ కొవ్వూరు ప్రి॥ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EA 29/2022 EP 13/2017 OS 298/2008
పిటీషనరు / DHR శ్రీమతి తెలగారెడ్డి పద్మావతి, W/o. శ్రీనివాస రావు, హిందూ, స్త్రీ, వయస్సు 42 సం॥, Properties, గోపవరం, నిడదవోలు మండలం
Vs
రెస్పాండెంట్లు/JDRS 1) శ్రీమతి గుంటూరు సామ్రాజ్యం (DIED) రెస్పాండెంట్లు / Proposed LRS OF DECEAASED 1st Respondent
2) శ్రీ గుంటూరు సత్యనారాయణ రెడ్డి, S/o. Late సుబ్బిరెడ్డి, హిందూ, వయస్సు 65 సం॥లు, పురుషుడు, Retd. FIRE OFFICER, కుమ్మర్ల వీధి, నిడదవోలు, నిడదవోలు మండలం, ప.గో.జిల్లా. ...NDD JCJC
3) శ్రీ గుంటూరు శ్రీనివాసులు రెడ్డి, S/o. సత్యనారాయణ రెడ్డి, హిందూ, వయస్సు 42 సం॥లు, పురుషుడు, LORRY OWONER CUM DRIVER, కుమ్మర్ల వీధి, నిడదవోలు, నిడదవోలు మండలం, ప.గో.జిల్లా. ...NDD JCJC
4) శ్రీ గుంటూరు తిరుమల రెడ్డి, S/o. సత్యనారాయణ రెడ్డి, హిందూ, వయస్సు : 40 సం॥లు, Private Employee, కుమ్మర్ల వీధి, నిడదవోలు, నిడదవోలు మండలం, ప.గో.జిల్లా. ...NDD JCJC
యీ నెంబరులో 4వ రెస్పాండెంటుకు LR పిటీషనుపై నోటీసు కోర్టు ద్వారాను Regd. Post ద్వారా అనేక పర్యాయములు పంపించిననూ అమలు జరుగనందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం యీ ప్రకటన వేయడమైనది.
యీ నెంబరులో 4వ రెస్పాండెంటు అయిన శ్రీ గుంటూరు తిరుమలారెడ్డి S/o. సత్యనారాయణ రెడ్డి నిడదవోలు అను వారు ది.20-10-2023వ తేదీ ఉదయం గం.10.30 లకు శ్రీ కోర్టు వారి పిలిపించే టైముకు స్వయంగా కానీ ప్లీడరు గారి ద్వారా గాకానీ హాజరై అక్షేపణలు వున్న యెడల తెలియ పరచుకొనవలెను. లేని యెడల Ex Partee చేసి పరోక్షమున తీర్మానించబడమగును.
వాయిదా : 20-10-2023
P.VENKANNA BABU, B.Com., B.L.
Advocate
Nidadavole : Cell : 9347 62 6143

పాస్‌పోర్టు పడిపోయినది
ఆచంట మండలం, పెదమల్లం గ్రామం అనగారి లంకకు చెందిన సిర్రా కుమారి, భర్త: ప్రసాద్‌కు చెందిన పాస్‌పోర్ట్ పడిపోయినది. జిరాక్స్ నిమిత్తము యర్రంశెట్టివారి పాలెం నుండి పి.గన్నవరం సెంటర్‌కు వచ్చుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికిన వారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.
సిర్రా కుమారి
భర్త: ప్రసాద్, డోర్ నెంబర్ 3-111,
అనగారి లంక, పెదమల్లం,
ఆచంట మండలం పశ్చిమ గోదావరి జిల్లా.
సెల్ : 95022 74915

పాస్‌పోర్టు పడిపోయినది
కాట్రేనికోన మండలం, బ్రహ్మసమేద్యం గ్రామం, కొత్తపాలెంకు చెందిన పెమ్మాడి ధర్మారావు, తండ్రి: సత్యంకు చెందిన పాస్‌పోర్ట్ పడిపోయినది. పాస్‌పోర్ట్ నెంబర్ R3004263. జిరాక్స్ నిమిత్తము కొత్తపాలెం నుండి ముమ్మిడివరం వచ్చుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికిన వారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.
పెమ్మాడి ధర్మారావు
తండ్రి: సత్యం, డోర్ నెంబర్ 11-104,
కొత్తపాలెం, బ్రహ్మసమేద్యం గ్రామం
కాట్రేనికోన మండలం,
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్ 8309827633

పాస్‌పోర్టు పడిపోయినది
పెనుమంట్ర మండలం, మార్టేరు గ్రామం న్యూ కాలనీకు చెందిన కంచర్ల సూర్య కిరణ్, తండ్రి: లక్ష్మణరావుకు చెందిన పాస్‌పోర్ట్ పడిపోయినది. పాస్‌పోర్ట్ నెంబర్ P5208267. జిరాక్స్ నిమిత్తము అబ్బిరెడ్డి కాలనీ నుండి కిమ్స్ మెడికల్ కళాశాలకు వచ్చుచుండగా మార్గ మధ్యలో పడిపోయినది. దొరికిన వారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.
కంచర్ల సూర్య కిరణ్
తండ్రి: లక్ష్మణరావు
C/o. మండపాటి సత్య, డో.నెం. 5-781,
అబ్బిరెడ్డి కాలనీ, కామనగరువు,
అమలాపురం మండలం,
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్: 89858 29096

ప్రకటన
మా క్లయింటు అయిన తూర్పు గోదావరి జిల్లా, పెద్దాపురం మండలం, సురంపాలెం గ్రామం, డోర్. నెం. 1-337 రు కాపురస్తులు అయిన గుత్తుర్తి పుత్రయ్య గారి కుమారుడు గుత్తుర్తి దుర్గ బాబు గారు మాకు ఇచ్చిన సంజాయిషీ పై యావన్మందికి తెలియజేయునది ఏమనగా..,
మా క్లయింటు అయిన గుత్తుర్తి దుర్గ బాబు గారు ముమ్మిడివరపు వెంకన్న మరియు వారి సోదరుడు అయిన ముమ్మిడివరపు అబద్ధం గారి ఆస్తి, అనగా 205.19 చ॥గ స్థలమును సర్వే నెం.75/2 సురంపాలెం గ్రామం, గండేపల్లి మండలం, తూర్పు గోదావరి జిల్లాలో ఉన్న ఆస్తిని వారి వారసులు అయిన ముమ్మిడివరపు అప్పారావు గారు మరియు 6 అదర్స్ గార్ల వద్ద నుండి ది.18-12-2021 డాక్యుమెంటు నెం. 5692/2021 క్రియ దస్తావేజు రీత్యా కొనుగోలు చేసినారు. సదరు ముమ్మిడివరపు వెంకన్న గారు కాలం చేసిన తరువాత వారి వారసుడు అయిన ముమ్మిడివరపు అప్పారావుగారు డెత్ సర్టిఫికేట్ మరియు కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం కోసం అప్లై చేయగా సదరు గ్రామ పంచాయతీ వారు Non Availability Certificateను ఇచ్చినారు. మా క్లయింటు అయిన గుత్తుర్తి దుర్గ బాబు గారు CHOLAMANDALAM INVESTMENT AND FINANCE COMPANY LIMITED (CIFCL), కాకినాడ బ్రాంచ్ వారి వద్దకు వారి ఆస్తిని కొదువ పెట్టి రిజిస్టర్ తనఖా చేసి అప్పు పొందే నిమిత్తం వెళ్ళినారు.
కావున పైన ఉదహరించిన విషయమును గమనించి మా క్లయింటు బ్యాంక్‌లో రుణము తీసుకునే విషయంలో గాని మరియు పైన ఉదహరించిన Non Availability Certificate విషయములో గాని ఎవరికైననూ ఎట్టి అభ్యంతరములు అయినను ఉన్న యెడల ఈ తేదీ లగాయితు 7 దినములలోగా మా క్లయింటునకు గాని లేదా దిగువ ఉదహరించిన మాకు గానీ లిఖితపూర్వకముగా తెలియపరచవలెను. లేని యెడల ఎవరికి ఎట్టిఅభ్యంతరములు లేవని భావించి మా క్లయింటు ముందుకను సాగెదరు. తదుపరి ఎవరైననూ ఎట్టి అభ్యంతరములైననూ తెలిపిన యెడల అవి మా క్లయింటు ను బైండు చేయవు. అట్టివి చెల్లనేరవు.
వక్కలంక సత్యనారాయణమూర్తి
P(V) వాణి శ్రీ, M(T) రాజశ్రీ, అడ్వకేట్స్,
డో. నెం.7-9-29, సాంబమూర్తి వీధి,
రామారావుపేట, కాకినాడ. సెల్: 98490 12112